అట్టహాసంగా ట్రిపుల్‌ఐటీ స్నాతకోత్సవం

600 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు.. గోల్డ్ మెడల్స్



హఫీజ్‌పేట్: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ స్నాతకోత్సవం అట్టహాసంగా సాగింది. గచ్చిబౌలి శాంతి సరోవర్ ప్రాంగణంలోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో 23వ స్నాతకోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్, డీఎస్ఐఆర్ సెక్రెటరీ డాక్టర్ ఎన్ కలైసెల్వి, గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ అశోక్ ఝున్‌ఝున్‌వాలా, ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజేనారాయణన్‌లు విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, గోల్డ్‌మెడల్స్ అందించారు.

పీహెచ్‌డీ చేయాలన్నదే లక్ష్యం



ఈసీడీలో డ్యూయల్ డిగ్రీ చేశా. ప్రస్తుతం బెంగళూరులో రూ.20 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. కానీ కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ పూర్తి చేయాలన్నదే లక్ష్యం.మా తండ్రి రిటైర్డ్ ప్రొఫెసర్ కె శ్రీనివాస్ ప్రస్తుతం కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. తల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం.

– విశ్వనాథ్, ఆల్‌రౌండర్ గోల్డ్ మెడలిస్ట్, ట్రిపుల్‌ఐటీ డ్యూయల్ డిగ్రీ

రాజకీయాల్లో రాణిస్తా



భవిష్యత్తులో రాజకీయాలలో రాణించాలన్నదే లక్ష్యం. కొన్నాళ్లు జాబ్ చేసి ఆ తర్వాత రాజకీయాల్లోకి వెళతా. ఎమ్మెల్యే అవ్వాలనే ఆలోచన ఉంది. మా నాన్న, పెదనాన్న రాజకీయాల్లో ఉన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసాగుతా. హైదరాబాద్ మైక్రోసాఫ్ట్‌లో రూ.50 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది, గూగుల్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తున్నా.

– హర్షవర్ధన్, ఆల్‌రౌండర్, ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్

బీఆర్ఎస్ ఖాళీ.. కాంగ్రెస్‌లో జోష్

శేరిలింగంపల్లిలో మారిన రాజకీయ సమీకరణాలు • ఒక ఒరలో రెండు కత్తులు ఇమిడేనా..


పార్టీ క్యాడర్‌తో కాంగ్రెస్ పార్టీలో చేరిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: పార్లమెంట్ ఎన్నికల వరకు ఎంతో పటిష్టంగా ఉన్న బీఆర్ఎస్ కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌తో ఖాళీ అయ్యింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ భారీ మెజార్టీతో మూడోసారి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఎమ్మెల్యే, 9 మంది కార్పొరేటర్లతో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఎంతో పటిష్టంగా కనిపించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరడం, పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓడిపోవడంతో ఎమ్మెల్యే గాంధీ చూపు కాంగ్రెస్ వైపు మళ్లింది. కొద్ది రోజులుగా నాన్చుడు ధోరణితో వ్యవహరించిన ఆయన శుక్రవారం పార్టీ మారుతున్నట్లుగా స్పష్టం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ అధిష్టానం బుజ్జగింపులు ఫలించలేదు. రాత్రి కేటీఆర్ స్వయంగా ఫోన్ చేసినా గాంధీ స్పందించలేదని తెలిసింది. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీ క్యాడర్‌తో కాంగ్రెస్‌లో చేరారు. 2014లో టీడీపీ నుంచి గెలుపొందిన గాంధీ, 2018లో టీఆర్ఎస్ నుంచి గెలిచారు. 2023లో బీఆర్ఎస్ అభ్యర్థిగా భారీ మెజారిటీతో గెలుపొందారు. నేడు పార్టీని వీడటంతో శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్ ఖాళీ అయ్యింది.

కాంగ్రెస్‌లో జోష్..

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వెంట శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో పాటు డివిజన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులు కాంగ్రెస్‌లో చేరిపోయారు. త్వరలో హైదర్‌నగర్ కార్పొరేటర్ శ్రీనివాస్ రావు, చందానగర్ కార్పొరేటర్ మంజుల, వివేకానందనగర్ కార్పొరేటర్ మాధవరం రోజా కాంగ్రెస్‌లో చేరనున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, ఆయన సతీమణి పూజిత కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. కాగా బీఆర్ఎస్ శేరిలింగంపల్లిలో గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఒక్కరే మిగిలారు. ఉద్యమకారులు, బీఆర్ఎస్ సానుభూతి పరులు ఉన్నప్పటికీ క్యాడర్‌ను ఎవరు నడిపిస్తారనే చర్చ జరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీకి 80 వేల మెజార్టీ రావడం, బీఆర్ఎస్ మూడవ స్థానానికి పరిమితం కావడం ఆ పార్టీ శ్రేణులకు ఆందోళన కల్గించింది. ఇక బీఆర్ఎస్ జెండాను ముందుండి ఎవరు మోస్తారో వేచి చూడాల్సిందే.

ఒక ఒరలో రెండు కత్తులు

బీఆర్ఎస్ నాయకులంతా ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన జగదీశ్వర్‌గౌడ్ బీఆర్ఎస్ అభ్యర్థి గాంధీ చేతిలో ఓటమి పాలయ్యారు. గాంధీ చేరికను గౌడ్ వర్గం వ్యతిరేకిస్తూ అసమ్మతి నేతగా మిగిలే అవకాశం ఉంది. ఇంచార్జిగా ఉన్న జగదీశ్వర్ గౌడ్, ఎమ్మెల్యే గాంధీ కలిసి పని చేస్తారా లేక వర్గ పోరును కొనసాగిస్తారా అనేది వేచి చూడాలి. 2029 నాటికి నియోజకవర్గాల పునర్విభజనలో శేరిలింగంపల్లిని రెండు నియోజకవర్గాలుగా చేసినా అప్పటి పరిస్థితులు ఎలా మారతాయో.. కాంగ్రెస్‌లో ఆరెకపూడి గాంధీ చేరికతో జగదీశ్వర్ గౌడ్ పరిస్థితి ఏంటనే చర్చ స్థానికంగా జరుగుతోంది. వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరుకునే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర


రథయాత్రను ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ తదితరులు

మియాపూర్: మియాపూర్‌లో ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ రథయాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై రథయాత్రను ప్రారంభించారు. చందానగర్ ఆర్ఎస్ బ్రదర్స్ నుండి మియాపూర్ మదీనాగూడ,ఆల్విన్‌క్రాస్ రోడ్డు, మియాపూర్ క్రాస్ రోడ్డు, జేపీఎన్‌నగర్ మీదుగా విశ్వనాథ్ గార్డెన్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో భక్తి వేదాంతస్వామి ప్రభుపాద, మియాపూర్ ఇస్కాన్ టెంపుల్ సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరి



మాదాపూర్: అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీరామ సంగీత పాఠశాల విద్యార్థులు సంగీత కచేరీ నిర్వహించారు. శ్రీరామ సంగీత పాఠశాల గురువు జొన్నలగడ్డ మాధురి శిష్యులు కేశవ హరిచరణ్, స్వేచ్ఛ రెడ్డి, వైష్ణవి, వందిత్య, ప్రతీక్ష్య, తరుణ్ బాలాజీ, శ్రీకృతి, లలిత, శరణ్య, లలితసౌజన్యలు పాల్గొని గోవింద గోవింద, ఎండగాని నీడగాని, శరణుశరణు, తిరుమలగిరిరాయ, ఆరగించి కూర్చున్న, తందనానాఅహి కీర్తనలు ఆలపించారు. కీబోర్డు మారుతీకిరణ్, తబలా శ్రీనివాస్ వాయిద్య సహకారాన్ని అందించారు.

కాంగ్రెస్ హయాంలోనే శంషాబాద్ అభివృద్ధి

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంతో పాటు ఔటర్ రింగురోడ్డు లాంటి అతి పెద్ద అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్ గుర్తు చేశారు. బీఆర్ఎస్‌ను వీడి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారంతో పాటు మరింత అభివృద్ధి కోసమే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి పెద్ద పీట వేస్తోందన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

ఫిలింనగర్: సమయానుకూలంగా వ్యాపార సంస్థలను మూసివేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని వ్యాపార సంస్థలు, ఇతరత్రా పాన్ డబ్బాలు, వైన్‌షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ షాపులు తప్ప మిగతా షాపులన్నీ రాత్రి 12 గంటల లోపు మూసివేయాలన్నారు. 12 తరువాత తెరిచి ఉంటే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తామన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముమ్మరంగా నాలా పనులు



జగద్గిరిగుట్ట: చింతల్, గణేశ్‌నగర్‌లో 1 కోటి 80 లక్షలతో చేపట్టిన నాలా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గాల్లో పాదచారులు, స్థానికులకు ఎలాంటి ఇబ్బందు ల్లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. మూడు నెలల్లోగా పనులు పూర్తి చేస్తామని ఏఈ మల్లారెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా సునీత


నియామకపత్రాన్ని అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మాజీ కౌన్సిలర్ కె.సునీత ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం నియామక పత్రాన్ని ఆ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్ ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, సురేష్‌గౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

రాజేంద్రనగర్: వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుద్వేల్ కోట మైసమ్మ తల్లి శ్వేత వారాహి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఉదయం నుండి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి నిర్వహించిన సామూహిక పూజా కార్యక్రమాలలో స్థానిక ప్రాంత వాసులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యప్రదర్శన



మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం తన్మయి ఆర్ట్ స్టూడియో శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. దుబాయ్‌లో భారతీయులకు, విదేశీయులకు నృత్యంలో శిక్షణ ఇస్తున్న నాట్యగురువు ప్రీతి తాతంబోట్ల వద్ద దుబాయ్‌లో కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందిన శిష్యులు రామాస, లక్ష్మి, మనోజ్ఞ, ప్రవళిక, వైష్ణవి, వీక్షితా, హ్యాంవిత, లాలనశ్రీ, సాన్వీరెడ్డి తదితరులు ప్రదర్శన ఇచ్చారు. ఇందులో గణేశ పంచరత్న, రామాయణశబ్దం, స్వాగతం కృష్ణ, అబాష్టకం, బాల కనకమయ, నంద నందన గోపాల, అంశాలను ప్రదర్శించారు.

– మాదాపూర్

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి


వైద్యశిబిరంలో పాల్గొన్న రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): కాలనీల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు శనివారం వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోజారాణి మాట్లాడుతూ ఇళ్ల ముందు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూలులో శనివారం విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ తేజేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చాక్లెట్స్, స్వీట్స్ ఎక్కువగా తినకూడదని సూచించారు. దంతక్షయం, దంతాల సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పంచశీల శ్రీనివాస్, డాక్టర్ తన్మయి, చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో సైన్స్ కీలకం



మాట్లాడుతున్న సామాజిక కార్యకర్త శాంతారావు

గచ్చిబౌలి: సమాజాభివృద్ధిలో సైన్స్ కీలకపాత్ర పోషిస్తుందని ప్రముఖ సాహితీవేత్త, సామాజిక కార్యకర్త శాంతారావు పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలిలోని సుందర్య విజ్ఞాన కేంద్రంలో జన విజ్ఞాన వేదిక హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో సైన్స్–సమాజం అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక అభివృద్ధి పెరుగుతున్న కొద్దీ మానవ సంబంధాలు నిర్వీర్యం అవుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. పిల్లల్లో భౌతిక, మానసిక, సాంఘిక పరమైన ఆరోగ్యాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అశాస్త్రీయమైన అభివృద్ధి కార్యక్రమాల వల్ల ఆర్థిక అసమానతలు తలెత్తుతున్నాయని జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షులు చంద్రశేఖరరావు అన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక గచ్చిబౌలి శాఖ అధ్యక్షులు ఎన్. శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.భరత్, ప్రధాన కార్యదర్శి రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు ఉపాధి కల్పనకు కృషి చేయాలి

మియాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేయాలని ఎఐఎఫ్‌డీవై రాష్ట్ర నిర్మాణ బాధ్యులు పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. మియాపూర్‌లోని స్టాలిన్‌నగర్‌లో అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య రాష్ట్ర కమిటీ సమావేశంను శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ...పాలకుల వినాశనకర విధానాల మూలంగా నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు రాయితీలు ఇస్తూ.. దేశ సంపదను కట్టబెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హామీలను అమలు పరిచే విధంగా పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎఐఎఫ్‌డీవై సుధాకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షులు రాజీరెడ్డి, నాయకులు మధుసూదన్, దశరథ్‌నాయక్, సుల్తానాబేగం, కీర్తి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

శంషాబాద్: మాదక ద్రవ్య నియంత్రణలో భాగంగా శంషాబాద్ పట్టణంలో పోలీసులు గత పదిహేను రోజులుగా తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం శంషాబాద్ ఏసీపీ కె.ఎస్ రావు, ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు నేతృత్వంలో పోలీసులు నాలుగైదు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. పాన్‌షాప్‌లు, లాడ్జీలు, హోటళ్లలో అణువణువు గాలించారు. పోలీసులతో పాటు డాగ్ స్క్వాడ్, నార్కోటిక్ డ్రగ్స్ అధికారులు పాల్గొన్నారు.

చెరువులన్నీ గుర్రపుడెక్కమయం


బాచుపల్లి పత్తికుంట చెరువులో అల్లుకుపోయిన గుర్రపు డెక్క

నిజాంపేట్: ఒకప్పుడు చెరువులు స్వచ్ఛమైన నీటితో కళకళలాడుతూ ఉండేవి. కానీ నేడు చెరువులను గుర్రపు డెక్క కమ్మేసింది. చెరువులను పర్యాటక కేంద్రాలుగా మార్చుతామన్న ప్రజాప్రతినిధుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. పలు సందర్భాల్లో చెరువుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని చెప్పినప్పటికి అవి క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. ప్రగతినగర్‌లోని అంబీర్ చెరువు, నిజాంపేట్‌లోని తుర్క చెరువు బాచుపల్లి ప్రాంతాలను అనుకుని ఉంది. ఇక బాచుపల్లిలోని బైరుని చెరువు, పత్తికుంట, మేడికుంట చెరువులు నిరుపయోగంగా మారిపోతున్నాయి. వీటి సంరక్షణకు, అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెరువులు అన్నీ గుర్రపుడెక్కతో నిండి ఉన్నాయి.

చెరువుల్లో డ్రైనేజీ నీరు

అంబీర్ చెరువు, తుర్కచెరువు, బైరుని చెరువు, పత్తికుంట, మేడికుంట, పాపయ్యకుంట లాంటి చెరువులన్నీ డ్రైనేజీ నీటితో నిండిపోయాయి. పెరుగుతున్న జనాభాతో భవనాలు పెరుగుతున్నాయి. డ్రైనేజీ పైప్‌లైన్లను ఆయా ప్రాంతాల్లో ఉన్న చెరువుల్లోకి అనుసంధానం చేస్తుండడంతో చెరువులు కలుషితమవుతున్నాయి. ఇటీవల బాచుపల్లిలోని పత్తికుంట చెరువులో పక్కనే ఉన్న ప్రైవేటు కాలేజీలు, స్కూల్స్, వ్యాపార సముదాయాల నుంచి డ్రైనేజీ నీటిని పత్తికుంట చెరువులోకి వదలడంతో గత నెల 28న చెరువులోని చేపలన్నీ మృతి చెందాయి. ఈ విషయంపై ముదిరాజ్ సంఘం వారు జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు.

దోమలతో బెంబేలెత్తుతున్న ప్రజలు

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు దోమలతో నరకం అనుభవిస్తున్నారు. సాయంత్రం 6 అయ్యిందంటే చాలు దోమలు విజృంభిస్తున్నాయని ,కంటి నిండా నిద్ర పోలేని పరిస్థితి ఉందంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.ఇక దోమ కాటుతో వ్యాధుల బారినపడి ఆస్పత్రులపాలవుతున్న పరిస్థితులు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నెలకొన్నాయి. కనీసం బస్తీల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం లేదు.

పేరుకే పర్యాటక ప్రాంతాలు

నిజాంపేట్‌లోని చెరువులను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని గత ప్రభుత్వం నుంచి హామీలు ఇస్తూ వస్తున్నారు. ఏకంగా ప్రగతినగర్‌లోని అంబీర్ చెరువును నాటి మంత్రి కేటీఆర్ సందర్శించి మిని ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. కాని ఇప్పటి వరకు అమలు కాలేదు. ఇక మిగత చెరువులను సైతం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పర్యాటక కేంద్రాలుగా మారుస్తామని అన్నారు. కాని ఇప్పటి వరకు అమలుకు నోచుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రగతినగర్‌లోని అంబీర్ చెరువు..


నిజాంపేట్‌లోని తుర్క చెరువు ..


పత్తికుంట చెరువులో మృతి చెందిన చేపలు (ఫైల్)

'బీటీఎన్‌జీఓ హౌసింగ్ సొసైటీ'లో ఉద్రిక్తత


సమావేశంలో అభివాదం చేస్తున్న బీటీఎన్‌జీఓ మరో వర్గం ఉద్యోగులు

హిమాయత్‌నగర్: మాజీ మంత్రి అండదండలతో గచ్చిబౌలి భాగ్యనగర్ మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, ఇతర నాయకులు అక్రమాలకు పాల్పడ్డారని గచ్చిబౌలి ఎన్జీవోస్ ఇళ్ల స్థలాల సాధన సమితి ప్రతినిధులు ఆరోపించారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన ఉద్యోగుల సమావేశంలో ఉద్రిక్తత నెలకొంది. సమావేశాన్ని సత్యనారాయణ గౌడ్ వర్గీయులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. సమావేశం నిర్వహిస్తున్న వారిపై దాడి చేసే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని దాడికి యత్నించిన వారిని అడ్డుకొని అక్కడి నుంచి తరలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో గచ్చిబౌలి ఎన్జీవోస్ ఇళ్ల స్థలాల సాధన సమితి అధ్యక్షుడు పాండురంగరావు మాట్లాడుతూ భూమిని ప్లాట్ల కింద డెవలప్ చేసి సీనియారిటీ ప్రకారం కేటాయించాల్సి ఉండగా, అక్రమాలకు తెరలేపి అనర్హులైన కొందరికి దొడ్డిదారిలో సభ్యత్వం ఇచ్చి లాటరీ ద్వారా జూనియర్లకు కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ నర్సింగరావు, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్‌రావు, జాయింట్ సెక్రటరీ ధన్‌రాజ్, ట్రెజరర్ రాజేశ్వరి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ అనిల్ కుమార్, హేమలత రెడ్డి, వెంకటేశ్వరరావు, చంద్రకళ, పద్మరెడ్డి పాల్గొన్నారు.

నిషేధిత గుట్కా పట్టివేత


గుట్కా విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో గల పలు కిరాణా షాపుల్లో పోలీసులు శనివారం దాడులు చేశారు. బొల్లారం ఎస్ఐ దశరథ్ ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. దత్తు అనే వ్యక్తి షాపులో రూ. 2 లక్షలు, రాకేష్ అనే వ్యక్తి షాపులో రూ. 80 వేలు, అంకుర్ అగర్వాల్ అనే వ్యక్తి షాపులో రూ. 70 వేల విలువచేసే నిషేధిత గుట్కాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుట్కాలు, డ్రగ్స్‌ను విక్రయిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఆముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సైబర్ మోసం

రూ.6 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి బురిడీ వేసి నగదు కాజేసిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని గ్రీన్‌విడోస్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి మే 19వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. లింకును ఓపెన్ చేసి తన వివరాలను నమోదు చేశారు.దీంతో ట్రేడింగ్ నిర్వాహకులు ఐడిని క్రియేట్ చేసి ఇచ్చారు.అతని నగదు ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు.పెట్టిన పెట్టుబడి, లాభాలు చూపిస్తూ వచ్చారు. మొత్తం రూ.6 లక్షల 49 వేలు ఇన్వెస్ట్ చేశాడు. తాను పెట్టిన నగదుతో పాటు, వచ్చిన లాభాలు ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లుగా గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి,అనంతరం శనివారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.